క్లుప్తంగా

జోడో యాత్ర ఇన్‌చార్జ్‌గా ఎడవల్లి కృష్ణ

కొత్తగూడెంరూరల్: హాథ్ సే హాథ్ అభియాన్ జోడో యాత్ర మహబూబాబాద్, డోర్నకల్ ఇన్‌చార్జ్‌గా 'టిపిసిసి జనరల్ సెక్రెటరీ ఎడవల్లి కృష్ణ నియమితులయ్యారు. మంగళవారం టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్‌గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతూ, యాత్రను భారీ జన సేకరణతో విజయవంతం చేస్తానని ఎడవల్లి కృష్ణ తెలిపారు.

శివకుమార్‌కు 'కళాబంధు' అవార్డు


అవార్డు అందుకుంటున్న శివకుమార్

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెంకు చెందిన ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ కళాబంధు అవార్డు అందుకున్నారు. హైదరాబాద్‌లో మంగళవారం నిర్వహించిన పల్లవి చరణ్ మ్యూజిక్ అకాడమీ వార్షికోత్సవ సభలో ఆయనకు రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండా శ్రీనివాస్ అవార్డు అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో రమణారెడ్డి, తులసీరామ్, సింగరేణి జీఎం అందెల ఆనందరావు, రవీందర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అభినందించారు.

అలవెన్సులపై చర్చించండి

ఇల్లెందు: కోల్ ఇండియా పరిధిలోని బొగ్గు బావులలో పని చేస్తున్న కార్మికులకు అందాలిన్న అలవెన్సులను తక్షణం ప్రకటించాలని, అందుకోసం మరోమారు జేబీసీసీఐలో అలవెన్సుల కోసం చర్చలు జరపాలని బీఎంఎస్ ఉపాధ్యక్షుడు నాయని సైదులు కోరారు. మంగళవారం ఇల్లెందులో జీఎం కార్యాలయం ఎదుట ఆందోళన చేసి అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో లీలా కృష్ణ, నాగేశ్వరరావు, రాము, పరంజ్యోతి, వెంకటేశ్వర్లు, శంకర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వీల్ చైర్ వితరణ

పాల్వంచ: లయన్స్ క్లబ్ ఆఫ్ గోల్డ్ ఆధ్వర్యంలో మంగళవారం కేటీపీఎస్ 6వ దశ ఏడీఈ చర్ల ముత్తయ్య దివ్యాంగురాలు స్వరూపకు వీల్‌చైర్‌ను వితరణగా అందించారు. క్లబ్ అధ్యక్షులు చాట్ల శ్రీనివాసరావు, ఆర్రుద్ర సత్యనారాయణ, పొట్రు సతీశ్, రోశయ్య చౌదరి, గండపనేని సతీశ్, నయీమ్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రుల్లో మందులు అందుబాటులో ఉంచాలి

జూలూరుపాడు: ప్రభుత్వాస్పత్రుల్లో అన్నిరకాల మందులు అందుబాటులో ఉంచాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమొక్రసీ పార్టీ మండల కార్యదర్శి వై.గోపాల్‌రావు, ఆదివాసీ సంక్షేమ పరిషత్ (ఏఎస్‌పీ) జిల్లా అధ్యక్షుడు తెల్లం నరసింహారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఎన్డీ, ఏఎస్‌పీ నాయకులు ఆస్పత్రుల్లో అన్నిరకాల మందులు అందుబాటులో ఉంచాలని కోరుతూ.. స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ ప్రదీప్తికి వినతిపత్రం అందజేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ.. ఆస్పత్రుల్లో యాంటీ బయాటిక్ ఇంజెక్షన్లు అందుబాటులో లేక పోవడంతో నిరుపేదలు ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. మందులు కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వల్లోజి రమేష్, రాయల సిద్ధు పాల్గొన్నారు.

భగత్ సింగ్ చరిత్రను తెలుసుకోవాలి

ఇల్లెందు: రెడ్ బుక్ డే సందర్భంగా స్వాతంత్ర్య సంగ్రామంలో ఉరితాడును ముద్దాడిన షాహీద్ భగత్ సింగ్ చరిత్రను ప్రజలు అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందని సీపీఎం మండల కార్యదర్శి ఎస్‌ఏ నబీ తెలిపారు. మంగళవారం ఇల్లెందులోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన రెడ్ బుక్ డే ఆవశ్యకతను వివరించారు. నేడు పాలకులు అవలంబిస్తున్న సామ్రాజ్యవాద విధానాలకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యం చేసేందుకు అధ్యయనం అవసరం అన్నారు. స్థానిక సమస్యలతో పాటు జాతీయ, అంతర్జాతీయ సమస్యలపై అధ్యయనం కలిగి ఉంటే ప్రజలను చైతన్యం చేసేందుకు దోహద పడుతుందని చెప్పారు. సమావేశంలో మోహన్‌రావు, టి.కృష్ణ, రాందాస్, అబ్బాస్, లక్ష్మి, విజయ, వైకుంఠం, జయ, క్రాంతి, హుస్సేన్, శ్రీను, సంతోష్, ఖైరున్, సాయిలు, వెంకన్న, భద్రమ్మ, మంగ పాల్గొన్నారు.

నిత్యావసరాలు పంపిణీ

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలో పని చేసే శానిటేషన్ వర్కర్లకు మంగళవారం కొబ్బరినూనె, సబ్బులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి హాజరై మాట్లాడారు. మున్సిపాలిటీలో పని చేసే 175 మంది అవుట్ సోర్సింగ్, 35 మంది రెగ్యులర్ కార్మికులకు కొబ్బరినూనె, సబ్బులను పంపిణీ చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, కమిషనర్ రఘు, మేనేజర్ సత్యనారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్, జవాన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కరుగుతున్న గుట్టలు

రోజురోజుకు మట్టి వినియోగం పెరగడంతో మొరం బంగారంగా మారింది. దీంతో కొందరు అక్రమార్కులు రాత్రివేళలో గుట్టలను కూడా గుట్టుగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. అధికారుల నిర్లక్ష్యంతో పెద్దపెద్ద గుట్టలు కరిగిపోతున్నాయి. ఎలాంటి అనుమతులు లేకుండానే మట్టి దందా కొనసాగిస్తున్నారు. దీంతో పర్యావరణ పరిరక్షణ దెబ్బతింటోంది. ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది. దీనిపై మైనింగ్, రెవెన్యూ, పోలీసు, ఫారెస్ట్ శాఖలకు చెందిన అధికారులు ప్రేక్షకపాత్ర పోషిస్తున్నారనే అరోపణలు వ్యక్తమవుతున్నాయి.

- రాత్రివేళలో మట్టి అక్రమ రవాణా
- పట్టించుకోని అధికారులు


రాజాపురంలో మట్టిని తరలిస్తున్న దృశ్యం

పాల్వంచరూరల్: మండలంలోని తోగ్గూడెం, రాజాపురం, యానంబైల్, కేశవాపురం, బస్వతారక కాలనీ ప్రాంతాల్లో మట్టి నిల్వలు అపారంగా ఉన్నాయి. ప్రైవేట్, ప్రభుత్వ అసైన్డ్ భూముల్లో ఎలాంటి అనుమతులు లేకుండానే రాత్రిపూట మట్టిని అక్రమంగా రవాణా చేస్తున్నారు. యానంబైల్ గ్రామ సమీపంలో పాండురంగాపురం, రాజాపురం గ్రామాల వద్ద గల గుట్టల మట్టిని చీకటి పడితే చాలు.. కిన్నెరసాని, తోగ్గూడెం ప్రధాన రహదారి గుండా మట్టి రావాణా జోరుగా సాగుతుంది. దీంతో గుట్టలు కనుమరుగువుతున్నాయి. కొంతమంది లారీల యజమానులు, కాంట్రాక్టర్లు సిండికేట్‌గా అక్రమ వ్యాపారం చేస్తున్నారు. మట్టి తరలింపు కారణంగా గుట్టల చుట్టు ఉన్న పచ్చని చెట్లని కూడా తొలగించి మట్టిని, రాళ్లను అమ్ముకుంటున్నారు. ఒక్కో లారి మట్టిని రూ.3వేల నుంచి 5వేల వరకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. రాత్రి సమయంలో గుట్టల నుంచి తవ్విన మట్టిని పాల్వంచ పట్టణంలో గృహ నిర్మాణాలకు, రహదార్ల నిర్మాణాలు, బ్రిడ్జి నిర్మాణ పనులకు తరలిస్తున్నారు. మరికొంతమంది మట్టిని నిర్దేశించుకున్న ప్రాంతాల్లో నిల్వ చేసి తర్వాత డిమాండ్‌ను బట్టి అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు.

20 లారీలకు పైగా స్వాధీనం..

గతేడాది తోగ్గూడెం, రాజాపురం, పాండురంగాపురం తదితర ప్రాంతాల నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్న 20 లారీలకుపైగా పోలీసులు, రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశారు. ఎత్తుపల్లాలు, గుట్టలుగా ఉన్న ప్రదేశంలోని మట్టిని తవ్వి భూమి చదును చేసుకు


రాత్రి సమయంలో మట్టి తవ్వకాలు

నేందుకు కొంతమంది రైతులు మట్టిని ఉచితంగా తవ్వుకొనేందుకు రెవెన్యూ అధికారులు అవకాశం కల్పించడంతో ఇదే అదునుగా భావించిన అక్రమదారులు ఇష్టారాజ్యంగా గుట్టలను కూడా తవ్వి అమ్ముతున్నారు.

అధికారులకు ఫిర్యాదు చేశాం



యానంబైల్, రాజాపురం ప్రాంతాల్లో రాత్రి సమయంలో గుట్టలు, పంటపొలాల నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి. మట్టి తరలింపుపై రెవెన్యూ అధికారులకు పలుసార్లు ఫిర్యాదు చేశాం. అయినా మట్టి అక్రమ రవాణా ఆగడం లేదు.

– పి.గోపి, సర్పంచ్, యానంబైల్

కఠిన చర్యలు తీసుకుంటాం



మండలంలో మట్టి తరలింపుకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు. గతంలో అనుమతులు తీసుకుని... తీసుకున్న దానికంటే అధికంగా మట్టిని తరలించినందుకు పాండురంగాపురంలో జరిమానా కూడా విధించాం. మట్టి అక్రమ రావాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

– జైసింగ్, భూగర్భ గనులశాఖ ఏడీఈ

అనుమతులు ఉండాలి



ఇసుక, మట్టిని అనుమతులు లేకుండా అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. గతే జూలై నుంచి ఇప్పటి వరకు రెవెన్యూ, పోలీసులు దాడులు నిర్వహించి మొత్తం 23 లారీలు, 17 ట్రాక్టర్లు, 3జేసీబీలు పట్టుకుని రూ.12. 65 లక్షల జరిమానా విధించాం.

– రంగాప్రసాద్, తహసీల్దార్, పాల్వంచ

జీకే ఓసీని సందర్శించిన జీఎం


గనిని పరిశీలిస్తున్న జీఎం రమేష్

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధిలోని జీకే ఓసీని మంగళవారం ఏరియా జనరల్ మేనేజర్ జక్కం రమేష్ సందర్శించారు. మాట్లాడుతూ.. గనిలో రెండు నెలల్లో బొగ్గు ఉత్పత్తి పూర్తిగా మూసివేయ బడుతుందని, గనిలో మిగిలిన ఉన్న బొగ్గును, ఓబీని జాగ్రత్తగా తీయాలని ఎవరికి ఎటువంటి హాని జరుగకుండా సురక్షితంగా ఉత్పత్తి చేయాలని, హైవాల్స్ స్టెబిలిటీ రెగ్యులర్‌గా మానిటర్ చేయాలని, ఎకో పార్క్‌కు వచ్చే సందర్శకులకు వ్యూ పాయింట్ ఏర్పాటు చేయాలని సూచించారు.

ఎకో పార్క్ వ్యూ పాయింట్ నుంచి బ్లాస్టింగ్ చూడటానికి బ్లాస్టింగ్ జోన్‌ను ఏర్పాటు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఆఫీసర్ శ్రీరమేష్, గని మేనేజర్ కరుణాకర్, సేఫ్టీ ఆఫీసర్ మురళీ, సర్వే ఆఫీసర్ నాగరాజు, సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం


ఆర్‌సీపేటలో రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ భూక్యా రాధ

టేకులపల్లి: ఉమ్మడి ప్రెగళ్లపాడు పంచాయతీ రాంపురం గ్రామానికి జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య జెడ్పీ నిధులు రూ.5లక్షలు మంజూరు చేశారు. ఈ మేరకు మంగళవారం గ్రామంలో రోడ్డు నిర్మాణ పనులను ఎంపీటీసీ బాణోతు సరోజిని ప్రారంభించారు. రోడ్డు సమస్యను పరిష్కరించినందుకు జెడ్పీ చైర్మన్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో రాంపురం సర్పంచ్ భూక్యా ఇందిర, కోయగూడెం సర్పంచ్ పూనెం ఉమ, మాజీ సర్పంచ్‌లు పూనెం సురేందర్, బాణోతు భద్రు పాల్గొన్నారు.

ఆర్‌సీ పేటలో..

రామచంద్రునిపేట పంచాయతీకి మంజూరైన జిల్లా పరిషత్ నిధులు రూ.5లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం ఎంపీపీ భూక్యా రాధ ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు ఈసాల ఉపేంద్ర బాబు, పూనెం ఉమ, పూనెం సురేందర్, పోశాలు, గణేష్, భద్రం, మధు రెడ్డి, సర్దార్, రవి, సోమయ్య, పాపయ్య, వెంకటేశ్వర్లు, మల్లయ్య, చంద్రయ్య పాల్గొన్నారు.

ఏరియాలో బీఎంఎస్ ఆధ్వర్యంలో ఆందోళన

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధిలోని పీవీకే-5షాఫ్ట్, ఏరియా జీఎం కార్యాలయం ఎదుట మంగళవారం బీఎంఎస్ ఆధ్వర్యంలో గేట్ మీటింగ్, ధర్నా కార్యక్రమాలు నిర్వహించి ఏరియా ఎస్‌ఓటూ జీఎం శ్రీ రమేష్‌కు నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. సింగరేణి యాజమాన్యం ఉదాసీనత వైఖరి వల్లనే బీఎంఎస్ ఈ ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తోందని, ఇప్పటికైనా యాజమాన్యం స్పందించి 11వ వేజ్‌బోర్డ్‌కు సంబంధించిన 8వ సమావేశం వెంటనే నిర్వహించి కార్మికులకు రావాల్సిన ఇతర అలవెన్స్‌లు తదితర అంశాలను క్లియర్ చేయాలని కోరారు. ఏరియా ఉపాధ్యక్షుడు మొగిలిపాక రవి, అశోక్ మిశ్రా, పవన్‌కుమార్, సంఘం చందర్, దాసరి శ్రీనివాస్, ఎస్.శ్రీనివాస్, ఆనంద్, రవి, బండా రమేష్ పాల్గొన్నారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

కొత్తగూడెం సింగరేణి మహిళా డిగ్రీ, పీజీ కళాశాల, పాల్వంచ, ఇల్లెందుల్లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో తెలుగు విభాగం ఆధ్వర్యంలో, టేకులపల్లిలోని ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పలువురు మాట్లాడుతూ.. తల్లితో సమానంగా మాతృభాషను ప్రతిఒక్కరూ గౌరవించాలని పేర్కొన్నారు. – సూపర్‌బజార్(కొత్తగూడెం)/ పాల్వంచరూరల్/ఇల్లెందురూరల్/టేకులపల్లి


ఇల్లెందురూరల్: మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ పోలారపు పద్మ


పాల్వంచరూరల్: మాట్లాడుతున్న డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై.చిన్నప్పయ్య


టేకులపల్లి: తెలుగు అక్షరాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ఉచిత వైద్య శిబిరం

పాల్వంచ: ఈనెల 26న కేటీపీఎస్ డీఏవీ పాఠశాలలో డాక్టర్ జీఎస్‌ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో హైదరాబాద్ యశోద ఆస్పత్రి సహకారంతో కేటీపీఎస్ ఉద్యోగులు, కార్మికులు, జర్నలిస్ట్‌లకు ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ట్రస్ట్ నిర్వాహకులు, రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ డాక్టర్ గడల శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 9000037676, 9000086767 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

పాఠశాలకు చేరని 'భగీరథ'


అలంకారప్రాయంగా నల్లా కనెక్షన్లు

సుజాతనగర్: హరిజనవాడ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు దాహం తీర్చుకునేందుకు ఇబ్బంది పడుతున్నారు. పాఠశాలలో 13 మంది విద్యార్థులు ఉన్నారు. అధికారుల నిర్లక్ష్యం విద్యార్థుల పాలిట శాపంగా మారింది. ఏడాది క్రితం పాఠశాల ఆవరణలో మిషన్ భగీరథ పైపుకనెక్షన్ ఏర్పాటు చేసి ట్యాపులు ఏర్పాటు చేశారు కానీ కనెక్షన్ మరిచారు. ఎవరూ పట్టించుకోవడం లేదు. దీంతో ఒకవైపు పాఠశాల విద్యార్థులు, మరోవైపు అంగన్‌వాడీ చిన్నారులకు తాగునీటి కష్టాలు తప్పడం లేదు. ఇప్పటికైనా మిషన్ భగీరథ పైపులైన్‌కు కనెక్షన్ ఇచ్చి తాగునీటిని సరఫరా చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

పోడుకు పట్టాలివ్వాలి


నిరసన వ్యక్తం చేస్తున్న దళిత రైతులు

పాల్వంచరూరల్: ఏజెన్సీలోని దళితులకు పోడుపట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ దళిత రైతులు మంగళవారం ఉల్వనూరు గ్రామ ప్రధాన రహదారిపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉపసర్పంచ్ బర్ల లక్ష్మణ్‌రావు మాట్లాడారు. ఏజెన్సీలో గిరిజనులతోపాటు వంద సంవత్సరాల నుంచి దళితులు కూడ నివాసం ఉంటూ పోడు సాగుచేసుకుంటూ జీవనం సాగిస్తున్నట్లు చెప్పారు. సీఎం కేసీఆర్ గిరిజనులకు మాత్రమే పోడుపట్టాలు ఇస్తారని ప్రచారం జరుగుతోంది ఏజెన్సీలో గిరిజనులతోపాటు గిరిజనేతరులైన దళితులకు కూడా పోడుపట్టాలు ఇచ్చి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతులు నక్కశ్రీను, బేతం రాములు, తడికల దాసు, అమృతరావు, జేమ్స్ నర్సింహారావు, రమణయ్య, వీరబాబు పాల్గొన్నారు.

మినీ ట్యాంక్ బండ్‌గా చింతల చెరువు


అధికారులతో మాట్లాడుతున్న కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు

పాల్వంచ: పాత పాల్వంచలోని చింతల చెరువుకట్టను రూ.10 కోట్ల వ్యయంతో మినీ ట్యాంక్ బండ్‌గా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం నీటి పారుదల శాఖ, మున్సిపాలిటీ అధికారులతో కలిసి చింతలచెరువు, బంగారుజాల గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వనమా మాట్లాడుతూ.. పాత పాల్వంచ పెట్రోల్ బంక్ నుంచి కొమ్ముగూడెం వరకు 50 అడుగుల వెడల్పుతో చింతల చెరువుపై రోడ్డును విస్తరించనున్నట్లు చెప్పారు. కట్ట మొత్తం బీటీ రోడ్డుతో నిర్మాణం చేస్తామని, ట్యాంక్ బండ్‌పై సెంట్రల్ లైటింగ్, రెయిలింగ్, రివిట్‌మెంట్, టైల్స్ వంటివి ఏర్పాటు చేస్తామన్నారు. బతుకమ్మ ఘాట్‌ను నిర్మిస్తామని చెప్పారు. సందర్శకులు విశ్రాంతి తీసుకోవడానికి 3 బ్యాంబో హట్‌లు నిర్మిస్తామని, పబ్లిక్ టాయిలెట్స్, పచ్చదనం, వాకింగ్ ట్రాక్, తెలంగాణ తల్లి విగ్రహాలు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. అదేవిధంగా రూ.8కోట్లతో పాత పాల్వంచ ముర్రేడు వాగుపై బంగారుజాల వరకు కాజ్‌వే నిర్మాణం చేపడుతామన్నారు. నిధులు మంజూరు చేయించిన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గ సమగ్రాభివృద్ధే లక్ష్యం అన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్, డీఈ మురళీ, ఇరిగేషన్ ఈఈ బి.అర్జున్, డీఈ ఎం.రాణి, ఏఈ డి.సరస్వతి, బీఆర్‌ఎస్ నాయకులు మచ్చా శ్రీనివాసరావు, కొత్వాల సత్యనారాయణ, మంతపురి రాజుగౌడ్, ఎస్‌వీఆర్‌కే.ఆచార్యులు, మల్లెల శ్రీరామ్మూర్తి, మహిపతి రామలింగం, కాల్వ ప్రకాశరావు, బండి చిన్న వెంకటేశ్వర్లు, దాసరి నాగేశ్వరరావు, కొత్తపల్లి సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో ఎమ్మెల్యే పర్యటన


సమస్యలు తెలుసుకుంటున్న ఇల్లెందు ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ

ఇల్లెందు: పట్టణంలోని 9,10,11,12,13,14 వార్డులలో ఎమ్మెల్యే హరిప్రియ మంగళవారం పర్యటించారు. ప్రజల కోరిక మేరకు ఆయా వార్డులలో పర్యటించి సమస్యలను స్వయంగా పరిశీలించారు. కాకతీయ నగర్‌లో సల్లేట్ డ్రెయినేజీని పరిశీలించారు. ముస్లింల శ్మశానవాటిక సమీపంలో రోడ్లను, కాలువలను పరిశీలించారు. వెంగళరావు నగర్‌లో రోడ్లు, కాలువలను పరిశీలించారు. మంచినీటి పైపులైన్ సమస్యను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. విద్యుత్ లైన్లు మరమ్మతులు, వీధి లైట్ల ఏర్పాటుతో పాటు పింఛన్ మంజూరు కావాలని, డబుల్‌బెడ్ రూం ఇల్లు ఇవ్వాలని ఆయా వార్డులలో ప్రజలు ఎమ్మెల్యేకు మొర పెట్టుకున్నారు. పాసీ కులస్తులు శ్మశానవాటిక వద్దకు వెళ్లి వచ్చి డీ బ్లాక్ వద్ద ఆరుబయట స్నానాలు చేస్తుంటారు. వారి కోసం ప్రత్యేకంగా స్నానాల గట్టు ఏర్పాటు చేసేందుకు రూ.30 లక్షల నిధులు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. ఇక వార్డులలో సమస్యల పరిష్కారం కోసం మరో రూ.20 లక్షల నిధులు కేటాయించారు. మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, వైస్ చైర్మన్ సయ్యద్ జానీపాషా, కమిషనర్ అంకుషావలీ, డీఈ రామకృష్ణ, ఏఈ శంకర్, వార్డు కౌన్సిలర్లు నాగలక్ష్మి, జేకే శ్రీనివాస్, బీఆర్‌ఎస్ నేతలు పాల్గొన్నారు.

28న సైన్స్ దినోత్సవం

కొత్తగూడెంఅర్బన్: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 28వ తేదిన జిల్లాలోని అన్ని పాఠశాలలు సైన్స్ కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా విద్యాధికారి ఎన్‌ఎస్‌ఎస్.ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి పాఠశాలలో సైన్స్ దినోత్సవ వేడుకలు నిర్వహించి విద్యార్థులకు సైన్స్ పట్ల ఆసక్తి కలిగించే కార్యక్రమాలు నిర్వహించాలని, పాఠశాల స్థాయిలో విజేలకు పెరెంట్స్ కమిటీ, స్థానికుల సహకారంతో ప్రోత్సాహక బహుమతులు అందజేయాలని సూచించారు. స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ హైదరాబాద్ సూచనల మేరకు పాఠశాల స్థాయిలో పోటీలు నిర్వహించాలని పేర్కొన్నారు. పోటీలు వ్యాసరచన, క్విజ్, సైన్స్ సెమినార్, చిత్రలేఖనం, సైన్స్ పుస్తక, ప్రయోగ ప్రదర్శనలు, బోధానాభ్యసన సామగ్రి తయారీ, సైన్స్ ప్రాజెక్టులు, శాస్త్రవేత్తలపై ఉపన్యాస కార్యక్రమాలు, విజ్ఞాన మేళా నిర్వహించాలని తెలిపారు. పాఠశాల, మండల స్థాయిలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు, చిత్రలేఖన పోటీలలో విజేతలుగా నిలిచిన ప్రథమ, ద్వితీయ విద్యార్థులను జిల్లా స్థాయి పోటీలకు పంపాలని తెలిపారు. జిల్లా స్థాయి పోటీలు ఈనెల 28న జరుగుతాయని వివరాలకు 9247296012 నంబరులో సంప్రదించాలని కోరారు.

బీఎస్పీ ఆధ్వర్యంలో నిరసన


నిరసన తెలుపుతున్న బీఎస్పీ నాయకులు

కొత్తగూడెంఅర్బన్: బహుజనుల పట్ల కేసీఆర్ వైఖరి సరైంది కాదని, ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన దళిత ఎమ్మెల్యే సాయన్న మరణిస్తే ప్రభుత్వ లాంఛనాలు వర్తించవా అని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ మేరకు మంగళవారం పార్టీ శ్రేణులతో కలిసి కొత్తగూడెంలోని పోస్టాఫీసు సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహం ఎదుట ప్లకార్డులతో నిరసన తెలిపారు. మాట్లాడుతూ.. మరణించిన వారి హోదా, వారు చేసిన సేవతో సంబంధం లేకుండా వారికి నచ్చిన వారికి అధికారికంగా అంత్యక్రియలు జరిపిస్తున్న ప్రభుత్వం, ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన దళిత ఎమ్మెల్యే విషయంలో ఇలా చేస్తారా అని ప్రశ్నించారు. తొమ్మిదేళ్లుగా అంబేడ్కర్ జయంతి, వర్ధంతులకు నివాళులర్పించని ముఖ్యమంత్రి ఎవరైనా ఉన్నారా అంటే అది కేసీఆర్ మాత్రమేనన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సాయి, మాలోత్ వీరునాయక్, చెనిగారపు నిరంజన్‌కుమార్, బొక్క శేఖర్, సరోజ, లక్ష్మి పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడికి చర్యలు తీసుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

చుంచుపల్లి: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ బాదావత్ శాంతి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో మండల పరిధిలో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. నీటి వసతి కొరకు అధికారులు త్వరితగతిన ఎస్టిమేషన్లు అందజేయడం లేదని సర్పంచులు ఫిర్యాదు చేశారు. ఎంపీపీ బాదావత్‌శాంతి మాట్లాడుతూ.. వేసవిని దృష్టిలో పెట్టుకొని గ్రామాల్లో నీటి ఎద్దడి రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అధికారులు పనిచేయాలని చెప్పారు. అనంతరం తహసీల్దార్ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ.. పోడు భూములకు పట్టాలు సిద్ధమయ్యాయని వాటిని సీఎం చేతుల మీదుగా త్వరలో అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖరరావు, ఎంపీడీఓ సకినాల రమేష్, ఎంపీఓ సత్యనారాయణ, వైస్ ఎంపీపీ మల్లికార్జునరావు, ఎంపీటీసీలు, సర్పంచులు, కార్యదర్శులు హాజరయ్యారు.



అటెన్షన్ ప్లీజ్

రహదారిపై పొంచి ఉన్న ప్రమాదం

నిత్యం రాకపోకలు సాగించే ప్రధాన రహదారిపై గుంత ప్రమాదకరంగా మారింది. పాల్వంచ మండలం సత్యనారాయణపురం నుంచి కారెగట్టు, సారెకల్లు గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారిపై పెద్ద గుంత ఏర్పడింది. ద్విచక్రవాహన, ఆటోలకు ప్రమాదకరంగా మారింది. పలు ప్రమాదాలు జరిగిన సందర్భాలు కూడా ఉన్నాయి. రహదారిపై ఏర్పడ్డ గుంతను పూడ్చాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు అనేకసార్లు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుపై ఉన్న గుంతను వెంటనే పూడ్చించాలని స్థానిక ప్రజలు, వాహనాదారులు కోరుతున్నారు.

– పాల్వంచరూరల్



ప్రశ్నించాల్సిన అధికారి : వంశీ,
ఆర్అండ్‌బీశాఖ ఏఈ
సెల్ నంబర్ : 9603465426